7

సాక్షి ఆదిలాబాద్

మంగళవారం ◦ 14 ◦ మే ◦ 2024

ఓటేసి.. సిరా చుక్క చూపిన అభ్యర్థులు


కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సుగుణ, వారి కుటుంబ సభ్యులు


బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్..


కుటుంబ సభ్యులతో బీఆర్ఎస్ అభ్యర్థి సక్కు..


సిరా గుర్తు చూపుతున్న కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం


కుటుంబ సభ్యులతో ఎంపీ సోయం బాపూరావు


ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఆయన కుటుంబ సభ్యులు


ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆయన సతీమణి హరిప్రియ


ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఓటేసిన ప్రముఖులు..

ఆదిలాబాద్‌టౌన్/కైలాస్‌నగర్/నేరడిగొండ/ఉట్నూర్ రూరల్/బజార్‌హత్నూర్: పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లా అధికారులతో పాటు ఆయా పార్టీల నాయకులు, పలువురు ప్రముఖులు సోమవారం తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాధారణ జనంతో వరుస క్రమంలో నిలబడి ఓటు వేశారు. లోని ప్రభుత్వ డైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలం ఓటు వేశారు. బోథ్ మండలం ఘన్‌పూర్ గ్రామంలో ఎంపీ సోయం బాపూరావ్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఆయన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. నేరడిగొండ మండలం రాజుర గ్రామంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆయన సతీమణి హరిప్రియ ఓటు వేశారు. మండలంలోని ఘన్ గ్రామ పోలింగ్ బూత్‌లో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ కుటుంబ సభ్యులతో కలిసి ఉట్నూర్‌లోని పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ బజార్‌హత్నూర్ మండలం జాతర్లలో ఓటు వేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు కుమురంభీం జిల్లా తిర్యాణి మండలం లక్ష్మీపూర్ గ్రామంలోని పోలింగ్ బూత్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు.

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ప్రతి రెండు గంటలకోసారి పోలింగ్ శాతం వివరాలు..

13.22 | 31.51 | 50.18 | 62.44 | 69.81 | 72.96


బేల మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో బారులుతీరిన ఓటర్లు


నానమ్మను పోలింగ్ కేంద్రానికి తీసుకొస్తున్న మనువరాలు

ఓటెత్తారు..

- గతంతో పోల్చితే పెరిగిన పోలింగ్ శాతం
- ఉదయం నుంచే కేంద్రాలకు తరలివచ్చిన ఓటర్లు
- చెదురుముదురు ఘటనలు మినహా ప్రశాంతం


ఓటు వేసిన ఆదివాసీలు


ఓటు వేసి తన పనిలో నిమగ్నమైన వృద్ధురాలు

మహిళను వీల్‌చైర్‌లో తీసుకెళ్తున్న సిబ్బంది

సాక్షి,ఆదిలాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు చైతన్యం చూపారు. గత ఎన్నికలతో పోల్చితే ఈసారి పోలింగ్ శాతం పెరిగింది. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో చెదురుముదురు ఘటనలు మినహా పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7గంటలకు ప్రక్రియ మొదలు కాగా, ఆసిఫాబాద్, సిర్పూర్‌లలో సాయంత్రం 4 గంటలకు ముగిసింది. మిగతా నియోజకవర్గాల్లో 6 గంటల వరకు కొనసాగింది. ఆయా నియోజకవర్గాల్లో నిర్దేశిత సమయం లోపు కేంద్రాలకు వచ్చినవారికి గేట్లు వేసి ఓటింగ్‌కు అవకాశం కల్పించారు.

ఉదయం జోరు..

ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాల్లో ఓటు వేసేందుకు ఓటర్లు ఉత్సాహం చూపారు. ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రక్రియ మొదలైంది. మధ్యాహ్నం ఒంటి గంట వరకు 50 శాతానికి పైగా నమోదైంది. మధ్యాహ్నం నుంచి సాయంత్రం ఓటింగ్ ముగిసే వరకు కేవలం 22.96 శాతం మాత్రమే పెరిగింది. ఆయా కేంద్రాల్లో పోలింగ్ ముగిసే సమయాని కంటే ముందే వచ్చిన వారికి ఓటు వేసేందుకు అవకాశం ఇచ్చారు.

ఉత్సాహం చూపిన ఓటర్లు..

ఓటు వేసేందుకు ఉదయంనుంచే ఓటర్లు ఉత్సాహం చూపారు. పలు కేంద్రాల్లో మహిళలు పెద్ద ఎత్తున బారులు తీరి కనిపించారు. ఈ లెక్కన మహిళల ఓటింగ్ పర్సెంటేజ్ గణనీయంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. పలుచోట్ల థర్డ్‌జెండర్ ఓటర్లు కూడా ఓటు హక్కు వినియోగించుకున్నారు.

వివాదాలు..

బజార్‌హత్నూర్ మండలంలోని మాన్కపూర్ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించే వరకు ఓట్లు వేయమని గ్రామస్తులు మొదట పోలింగ్ బహిష్కరించారు. తహసీల్దార్ శంకర్, ఎస్సై నరేశ్ వారిని సముదాయించారు. ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాతో ఈ విషయంలో ఫోన్‌లో మాట్లాడించారు. వారంలో గా వచ్చి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించి ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఇదే మండలంలోని దేగామలో చెరువు ముంపు కారణంగా తమకుఅన్యాయం జరిగిందని గ్రామస్తులు ఓటింగ్ బహిష్కరించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వారిని సముదాయించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ గ్రామస్తులను జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో ఫోన్‌లో మాట్లాడించారు. ఈ విషయంపై దృష్టి సారిస్తామని ఆమె చెప్పడంతో తమ ఆందోళనను విరమించి పోలింగ్‌లో పాల్గొన్నారు. తలమడుగు మండలంలోని కజ్జర్ల గ్రామంలో ఎన్నికల అధికారులకు ఏర్పాటు చేసిన భోజనంలో బీఆర్ఎస్ నాయకులు కూడా భోజనం చేయడంతో కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భీంపూర్ మండలం అందర్‌బంద్ గ్రామానికి ఎన్నికల విధులకు వెళ్లిన ఉద్యోగి ప్రఫుల్ రెడ్డి ఆదివారం రాత్రి బాత్‌రూమ్‌కు వెళ్లినప్పుడు పాము కాటువేసింది. ఆయనను రిమ్స్‌కు తరలించారు. బేల, తాంసి, జామిడి, బోథ్ మండలం కౌఠ (బి)లలో ఈవీఎంలు మొరాయించడంతో కొద్దిసేపు ఓటింగ్ నిలిచిపోయింది. ఆ తర్వాత వాటిని సరిదిద్దడంతో కొనసాగింది. ఆదిలాబాద్ పట్టణంలోని తిర్పెల్లి ఖిల్లా పోలింగ్ బూత్‌లో ఏజెంట్‌గా ఉన్న గొర్ల రాముపై ఓ వర్గానికి చెందిన 50 మంది వ్యక్తులు దాడి చేసినట్లు ఆయన కుటుంబసభ్యులు తెలిపారు. రాత్రి వన్‌టౌన్ ఎదుట ఆందోళన చేపట్టారు.

‘కంట్రోల్’ చేస్తూ..


కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కమ్యూనికేషన్ కంట్రోల్ రూం

- నిరంతర పర్యవేక్షణ.. పోలింగ్ శాతం పరిశీలన
- కలెక్టరేట్‌లో కమ్యూనికేషన్ కంట్రోల్ రూం
- ఎన్నికల ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్, పరిశీలకులు


పోలింగ్ సరళి పరిశీలిస్తున్న పరిశీలకులు, కలెక్టర్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ ఎంపీ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ సరళి, ఆయా కేంద్రాల్లోని స్థితిగతులను పరిశీలించేందుకు ఆదిలాబాద్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కమ్యూనికేషన్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. పోలింగ్ శాతం ఎప్పటికప్పుడు తెలుసుకునేందు కోసం ప్రత్యేకంగా సిబ్బందిని నియమించడంతో పాటు కంప్యూటర్లను ఏర్పాటు చేశారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేంద్ర విజయ్, రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజర్షి షా వెబ్ కాస్టింగ్ ద్వారా పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాలను ఈ కమ్యూనికేషన్ కంట్రోల్ రూం నుంచి పరిశీలించారు. ఈవీఎంల మొరాయింపు, శాంతిభద్రతలకు సంబంధించి తలెత్తిన సమస్యలపై ఆయా కేంద్రాల్లోని అధికారులకు ఎప్పటికప్పుడు సూచనలు చేశారు. మాక్ పోలింగ్ ప్రారంభమైనప్పటి నుంచి పోలింగ్ ప్రక్రియ ముగిసేవరకు ఈ కేంద్రంలోనే అందుబాటులో ఉండి పోలింగ్ తీరును పరిశీలించారు. ఎప్పటికప్పుడు అందిన పోలింగ్ శాతాన్ని ప్రతి రెండు గంటలకు ఒకసారి అధికారికంగా విడుదల చేశారు.

సెల్ఫీ టైమ్..



తొలిసారి ఓటు వేసిన సంబురంలో..


హనుమాన్ దీక్షాపరులతో ఎమ్మెల్యే శంకర్..


కుటుంబ సభ్యులతో కలిసి సెల్ఫీ

నిఘా నీడన పోలింగ్

- పోలీసుల భారీ బందోబస్తు
- పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ


పోలింగ్ కేంద్రం వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్/కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు. జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో పహారా కాసారు. ప్రతీ పోలింగ్ కేంద్రం పరిధిలో 100 మీటర్ల వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలను లోనికి రాకుండా చూశారు. జిల్లా కేంద్రంలో అక్కడక్కడా కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోక పోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఎస్పీ గౌస్ ఆలం పట్టణంలోని మహాలక్ష్మివాడ, ఖానాపూర్, కేఆర్‌కే కాలనీ, హిందీ హైస్కూల్ పోలింగ్ కేంద్రంతో పాటు తిర్పెల్లి, తాంసి మండలంలోని పొన్నారి, తలమడుగు మండలంలోని సుంకిడి, రుయ్యాడిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, వన్‌టౌన్, టూటౌన్ సీఐలు సత్యనారాయణ, అశోక్ ఉన్నారు.

చెదురుముదురు ఘటనలు..

జిల్లా కేంద్రంతో పాటు పలుచోట్ల చెదురుముదురు ఘటనలు చోటు చేసుకున్నాయి. కాంగ్రెస్, బీజేపీ, ఆయా పార్టీల నాయకులు పోలింగ్ కేంద్రాల వద్ద వాగ్వాదానికి దిగారు. పోలీసులు వారిని అక్కడిని పంపించేశారు.

- జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఓటు హక్కు వినియోగించుకునేందుకు కాషాయ రంగు కండువా వేసుకొని వచ్చారు. దీంతో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి సతీమణి సాయిమౌన రెడ్డి ఎమ్మెల్యేతో వాగ్వాదానికి దిగారు. ఎమ్మెల్యే అక్కడినుంచి వెళ్లిపోగా, బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు చేరుకొని వారిని అక్కడినుంచి పంపించేశారు.
- తిర్పెల్లి కేంద్రం వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు వంద మీటర్ల లోనికి వచ్చారని పోలీసులతో బీజేపీ నాయకులు చెప్పడంతో అక్కడ కొంత ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు వారిని అక్కడినుంచి పంపించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.


ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో వాగ్వాదానికి దిగిన కాంగ్రెస్ నాయకురాలు సాయిమౌన రెడ్డి

- పట్టణంలోని పుత్లీబౌళి షాదీఖానా పోలింగ్ కేంద్రం వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు గుమిగూడారు. పలుమార్లు పోలీసులు చెప్పినప్పటికీ వినిపించుకోకపోవడంతో కానిస్టేబుల్ వారిని వారించారు. ఓ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఆయనపై బండతో దాడి చేసేందుకు యత్నించాడు. అక్కడున్న వారు అడ్డుకోవడంతో వెళ్లిపోయాడు. సంఘటన స్థలానికి వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.
- మహాలక్ష్మివాడలోని పోలింగ్ కేంద్రం వద్దకు కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి కండువాతో అక్కడికి వెళ్లగా, బీజేపీ నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పార్టీ కండువా ఉన్న వ్యక్తిని లోనికి ఎలా అనుమతిస్తారని ప్రశ్నించారు. దీంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. ఆ తర్వాత పరిస్థితి అదుపులోకి వచ్చింది. స్వల్ప ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. నిఘా నీడలో ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పోలింగ్‌కేంద్రం టు స్ట్రాంగ్‌రూం

- అభ్యర్థుల భవితవ్యం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లలో నిక్షిప్తం
- స్ట్రాంగ్‌రూంలకు చేరిన ఈవీఎంలు
- రాజకీయ పార్టీల సమక్షంలో భద్రపరిచిన అధికారులు


ఈవీఎంకు సీల్ వేస్తున్న పోలింగ్ సిబ్బంది


పోలింగ్ సామగ్రితో జిల్లా కేంద్రంలోని టీటీడీసీకి చేరుకున్న ఎన్నికల సిబ్బంది

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ముగిసింది. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బరిలో నిలిచిన 12 మంది అభ్యర్థుల భవితవ్యం ఓటర్లు తమ తీర్పును ఈవీఎంల్లో నిక్షిప్తం చేశారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలు సోమవారం రాత్రి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రాలకు చేరుకున్నాయి. సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ ప్రక్రియ ముగిసిన వెంటనే ప్రత్యేక వాహనాల్లో ఆయా నియోజకవర్గాల నుంచి సామగ్రితో బయలుదేరిన పోలింగ్ సిబ్బంది అర్ధరాత్రి వరకు ఆదిలాబాద్‌కు చేరుకున్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను భద్రపరిచేందుకు గాను ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మూడు చోట్ల స్ట్రాంగ్ రూంలను ఏర్పాటు చేశారు. అలాగే మూడు రిసెప్షన్ కేంద్రాలను సైతం ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలకు సంబంధించి టీటీడీసీలో, నిర్మల్, ఖానాపూర్, ముథోల్ నియోజకవర్గాలకు సంబంధించి ప్రభుత్వ సంజయ్‌గాంధీ పాలిటెక్నిక్‌లో, ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాలకు సంబంధించి జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాల నుంచి ప్రత్యేక వాహనాల్లో చేరుకున్న ఎన్నికల సిబ్బంది కంట్రోల్‌యూనిట్, బ్యాలెట్ యూనిట్లతో కూడిన ఈవీఎంలను సంబంధిత అధికారులకు అప్పగించారు. అనంతరం ఆయా నియోజకవర్గాలకు సంబంధించిన రిటర్నింగ్ అధికారులు, రాజకీయ పార్టీల అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో సీజ్ చేసిన ఈవీఎంలను స్ట్రాంగ్‌రూంల్లో భద్రపరిచారు. ఈ ప్రక్రియ మంగళవారం వేకువజాము వరకు కొనసాగింది. స్ట్రాంగ్‌రూంల వద్ద సాయుధ బలగాలతో కూడిన మూడంచెల భద్రత ఏర్పాటుచేశారు. జూన్ 4న ఆయా కేంద్రాల్లో వీటి ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. పోలింగ్, ఈవీఎంల తరలింపు, భద్రపరిచే ప్రక్రియను పరిశీలకులు రాజేంద్ర విజయ్, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం పర్యవేక్షించారు.

క్లుప్తంగా

జర్మనీ నుంచి వచ్చి..!



ఓటుహక్కు వినియోగించుకున్న ఆకాష్

కుంటాల: మండలంలోని లింబా(కె) గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు నానాజీ పటేల్–గంగాసాగర దంపతుల కుమారుడు సిందె ఆకాష్ ఉన్నత చదువుల నిమిత్తం జర్మనీకి వెళ్లాడు. సోమవారం గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో ఓటుహక్కు వినియోగించుకున్నాడు.

నా ఓటు తొలగించారు..



ఆధార్ కార్డుతో జుబేదా బేగం

నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన 58 ఏళ్ల జుబేదా బేగం గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకున్నారు. సోమవారం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వెళ్లగా లిస్టులో పేరు లేదని తెలపడంతో ఓటు వేయకుండానే నిరాశగా ఇంటికి వెనుదిరిగింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఓటు వినియోగించుకోలేక పోయానని వాపోయింది.

గెలుపుపై బీజేపీ ధీమా

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానాన్ని భారీ మెజార్టీతో కైవసం చేసుకోవడం ఖాయమని ఎమ్మెల్యే పాయల్ శంకర్, బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ ధీమా వ్యక్తం చేశారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పోలింగ్ సరళిపై సమీక్షించారు. ఎన్నికల్లో విజయం ఖాయమని మిఠాయిలు తినిపించుకుని సంతోషం వ్యక్తం చేశారు.

మాంగ్రుడ్‌లో పులి సంచారం..!



పులి అడుగులు చూపిస్తున్న రైతు

బేల: మండలంలోని మాంగ్రుడ్ రెవెన్యూ గ్రామ శివారులో పులి సంచరించినట్లు స్థానికంగా చర్చించుకుంటున్నారు. సోమవారం ఆ రెవెన్యూ గ్రామ శివారులోని వాగు వైపు ఉన్న పొలం పనులకు వెళ్లిన క్రమంలో రైతు అగార్కర్ ఈశ్వర్ వెళ్లే దారిలో, పొలంలోనూ పులి అడుగులను గమనించాడు. ఆ అడుగులు వాగు దాటి పెన్‌గంగ వైపుకు వెళ్లినట్లు గుర్తించాడు. గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. సిబ్బంది పరిశీలన తర్వాత నిర్ధారణకు వస్తామని, అప్పటిదాకా గ్రామస్తులు ఆ వైపు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించినట్లు తెలిపారు.

ఉత్సాహంగా తొలి ఓటు

- మొదటిసారి ఓటు వినియోగించుకున్న యువత
- నిజాయతీగా ఓటేయడం గర్వంగా ఉందంటున్న పౌరులు

ప్రజాస్వామ్యం విజయవంతం కావడంలో ఓటుహక్కు ఎంతో కీలకం. ముఖ్యంగా ఈ విషయంలో యువత బాధ్యతగా ఓటు వేయాల్సి ఉంటుంది. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు ఎన్నికల కమిషన్ ఓటుహక్కు కల్పించడంతో పార్లమెంట్ ఎన్నికల్లో తొలిసారిగా ఓటు వేశారు. కుటుంబ సభ్యులతో కలిసి ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి మొదటిసారి ఓటువేసి కొత్త అనుభూతి పొందారు. ఈ సందర్భంగా మొదటిసారి ఓటు వేసిన పలువురు యువతీ యువకుల అభిప్రాయాలు వారి మాటల్లోనే...



ఆనందంగా ఉంది

నిర్మల్‌చైన్‌గేట్: ఈసారి నాకు మొదటిసారి ఓటు హక్కు వచ్చింది. ఫస్ట్ టైం ఓటు వేయడం చాలా ఆనందంగా ఉంది. ఎన్నికలు వచ్చిన ప్రతీసారి మాకెప్పుడు అవకాశం వస్తుందా అని ఎదురుచూసేవాళ్లం. ఇప్పుడు ఆ అవకాశం రావడం సంతోషంగా ఉంది.

– పల్లవి, నిర్మల్

ఓటేసిన కవలలు



మంచిర్యాలటౌన్: పట్టణంలోని హైటెక్‌సిటీ కాలనీకి చెందిన కవలలు ఆది శ్రీజ ఎంబీబీఎస్, శ్రీకర్ ఇంజనీరింగ్ చేస్తున్నారు. మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకున్నారు. దేశాన్ని పాలించే వారిని ఎన్నుకునేందుకు ఓటు ఒక ఆయుధమని, అందుకే తాము ఓటు వేసేందుకు హైదరాబాద్ నుంచి వచ్చామన్నారు.

– ఆది శ్రీజ, ఆది శ్రీకర్, మంచిర్యాల



ముధోల్: పోట్‌పల్లిలో తొలిసారి ఓటుహక్కు వినియోగించుకున్న యువకులు

సంతోషంగా ఉంది



లక్ష్మణచాంద: మాది లక్ష్మణచాంద మండలంలోని పార్‌పెల్లి. పార్లమెంట్ ఎన్నికల్లో మొదటిసారి ఓటుహక్కు వినియోగించుకోవడం చాలా సంతోషంగా ఉంది.

– ధనలక్ష్మి, పార్‌పెల్లి

హైదరాబాద్ నుంచి వచ్చా



మంచిర్యాలటౌన్: హైదరాబాద్‌లో ఎంబీబీఎస్ చదువుతున్నా. నాకు మొదటిసారి ఓటు హక్కు రావడంతో వినియోగించుకునేందుకు మంచిర్యాలకు వచ్చా. మొదటిసారి ఓటు వేయడం ఆనందంగా ఉంది. ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి.

– గడియారం అక్షయ, మంచిర్యాల

యువత పాత్ర కీలకం



నిర్మల్‌చైన్‌గేట్: దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం. ఎన్నికల ద్వా రా మన భవిష్యత్‌ను మనమే నిర్ణయించుకునే అవకాశం లభిస్తుంది. అందుకే ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి. తొలిసారిగా ఓటు వేసే అవకాశం రావడం చాలా ఆనందంగా ఉంది.

– శ్రీయ, ప్రియదర్శినినగర్, నిర్మల్

ధనిక, పేద తేడాలేనిది..



నిర్మల్‌చైన్‌గేట్: ధనిక, పేద, స్త్రీ, పురుష, తది తర తేడాలు లేకుండా పొందే ఓటు హక్కును మొదటిసారి సక్రమంగా వినియోగించుకున్నా. ఎన్నికైన నాయకులు సరిగా పనిచేయకుంటే అప్పటికప్పుడు తొలగించే అధికారం ఓటర్లకు కల్పించాలి.

– శ్రీవాణి, బుధవార్‌పేట్, నిర్మల్

కొత్త అనుభూతి



నిర్మల్‌చైన్‌గేట్: పార్లమెంట్ ఎన్నికల్లో మొదటిసారిగా ఓటు వేయడం ఆనందంగా ఉంది. గతంలో బ్యాలెట్ పేపర్లపై ఓటు వేసేవారు. ప్రస్తుతం ఈవీఎంలో ఓటు వేస్తున్నారని చెబితే వినడం తప్ప చూడలేదు. మొదటిసారి పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేయడం ఓ కొత్త అనుభూతినిచ్చింది.

– రసజ్ఞ, ప్రియదర్శినినగర్, నిర్మల్

వరంగల్ నుంచి వచ్చా



సోన్: మాది సోన్ మండలంలోని న్యూవెల్మల్ గ్రామం. వరంగల్‌లోని కాకతీయ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నా. నాకు మొదటిసారి ఓటుహక్కు రావడంతో వరంగల్ నుంచి వచ్చి ఓటువేశా. చాలా ఆనందంగా ఉంది.

– కొండ రిత్విజ, న్యూవెల్మల్, సోన్

ఇటీవలే ఓటుహక్కు వచ్చింది



లక్ష్మణచాంద: మాది లక్ష్మణచాంద మండలంలోని ధర్మారం. ఇటీవలే ఓటుహక్కు వచ్చింది. పార్లమెంట్ ఎన్నికల్లో మొదటిసారి ఓటు వినియోగించుకున్నా. చాలా ఆనందంగా ఉంది.

– సౌజన్య, ధర్మారం

సంతృప్తినిచ్చింది



నిర్మల్‌చైన్‌గేట్: ఫస్ట్ టైం ఓటు వేయడం ఆనందంగా ఉంది. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలి. దీనిపై ప్రజల్లో మరింత అవగాహన తీసుకురావాలి.

– రేణుక, ఇందిరానగర్

ఆతృతగా ఓటేశా..



నిర్మల్: నాకు 18ఏళ్లు రాగానే ఓటుహక్కు కోసం అప్లయ్ చేసుకున్నా. ప్రస్తుతం హైదరాబాద్‌లో చదువుతున్నా. తొలిసారే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటువేయడానికి చాలా ఆతృతగా వచ్చి ఓటేశా. కొత్తగా అనిపించింది.

– లక్కిడి శివసాయిరెడ్డి, నిర్మల్

బాధ్యతగా అనిపించింది..



నిర్మల్: హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నా. ఎన్నికల్లో ఓటు వేయడం ఇదే తొలిసారి. అమ్మానాన్నలతో కలిసి వెళ్లి ఓటేశా. ఈ దేశపౌరాలిగా ఓటువేయడం నా బాధ్యత అన్న ఫీలింగ్ అనిపించింది.

– కారేగామ అక్షయ, నిర్మల్

తెలియని ఫీలింగ్..



నిర్మల్: ఓటు వేయడం ఓ కొత్త ఫీలింగ్‌లా ఉంది. పోలింగ్ కేంద్రంలోకి వెళ్లగానే ఓటర్‌గా ఓ బాధ్యత మనపై ఉందన్నట్లు అనిపించింది. రాజ్యాంగం ఇచ్చిన హక్కును వినియోగించుకున్నా.

– శశాంక్, నిర్మల్

ఆకట్టుకున్న మోడల్ పోలింగ్ కేంద్రాలు



మోడల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్



వాయిద్యాలతో ఓటర్లకు కళాకారుల స్వాగతం

ఆదిలాబాద్‌టౌన్/కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ఆకట్టుకునేందుకు అధికారులు పలు పోలింగ్ కేంద్రాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. పట్టణంలోని ప్రభుత్వ డైట్ కళాశాల, కొలాం ఆశ్రమ పాఠశాల, ప్రభుత్వ బాలికల కళాశాల, జెడ్పీఎస్ఎస్ సరస్వతినగర్, ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడలలో వీటిని ఏర్పాటు చేశారు. వెదురు బొంగులు, కుండాలు, రెడ్ కార్పెట్ వేసి ఆహ్వానం పలికేవిధంగా తీర్చిదిద్దారు. వికలాంగుల కోసం వీల్ చైర్లను ఏర్పాటు చేశారు. సెల్ఫీ పాయింట్ల వద్ద సెల్ఫీ దిగుతూ సందడి చేశారు. అధికారులతో పాటు పలువురు సెల్ఫీ పాయింట్ల వద్ద ఫొటోలు దిగడం కనిపించింది. ఇదిలా ఉండగా జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద ఢోలు వాయిద్యాలతో ఓటర్లకు స్వాగతం పలికారు.

ఓటేసిన ప్రజాప్రతినిధులు, ప్రముఖులు



ఓటువేసిన మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ ఇన్‌చార్జి నారాయణ్‌రావుపటేల్



కుటుంబ సమేతంగా ఓటు వేసిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోహన్‌రావుపటేల్



ఓటువేసిన మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎండీ జాబీర్ అహ్మద్

భైంసాటౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీల ప్రతినిధులు, ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే రామారావుపటేల్, మాజీ ఎమ్మెల్యే బి.నారాయణ్‌రావుపటేల్ పట్టణంలోని సుభద్రవాటిక శ్రీసరస్వతి శిశుమందిర్ పోలింగ్ కేంద్రంలో తమ ఓటును వినియోగించుకున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బి.మోహన్‌రావుపటేల్ వ్యవసాయ శాఖ కార్యాలయంలోని పోలింగ్‌కేంద్రంలో కుటుంబసమేతంగా ఓటు వేశారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎండీ జాబీర్ అహ్మద్ మదీనాకాలనీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పోలింగ్‌కేంద్రంలో ఓటేశారు.

విద్యుత్ షాక్‌తో మూడు ఎద్దులు మృతి

పెంబి: మండలంలోని తులసీపేట్ గ్రామ సమీపంలో సోమవారం విద్యుత్ తీగ తెగిపడి మూడు ఎద్దులు మృతి చెందాయి. పుల్గంపాడి గ్రామానికి చెందిన లావుడ్య దస్సింగ్, లావుడ్య దేవిసింగ్, నాయకపుగూడకు చెందిన నాగోళ్ల గంగయ్య ఒక్కో ఎద్దు మేతకు వెళ్లగా విద్యుత్ తీగ తెగిపడడంతో మృతి చెందాయి. మృతి చెందిన ఎడ్లను ఏఈ శ్రీనివాస్ పరిశీలించి వివరాలు సేకరించారు. నాయకపుగూడ గ్రామస్తులు బోర్ మోటార్‌కోసం అనధికారికంగా వైర్లులాగారని, అందులో ఒకవైరు తెగి పడడంతో వాటిని తాకడంతో మృతి చెందినట్లు పేర్కొన్నారు.

ఖానాపూర్‌లో గేదె..

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలో తోట నవీన్‌కు చెందిన గేదె సోమవారం మేతకు వెళ్లింది. పంటచేనులో మేత మేస్తుండగా వ్యవసాయ బావి వద్ద గల విద్యుత్ స్తంభానికి ఉన్న సపోర్టు తీగతగిలి షాక్‌కు గురైంది. గమనించిన పశువుల కాపరి ఆత్రం శేఖర్ గేదెను కాపాడే క్రమంలో అతనికి కూడా షాక్‌కొట్టడంతో ప్రమాదం నుంచి బయటపడ్డాడు. గేదె విలువ రూ.65 వేలు ఉంటుందని, బాధిత రైతుకు న్యాయం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

యువకుడిపై కేసు

నిర్మల్‌రూరల్: ఓటు వేస్తుండగా ఫోన్‌లో చిత్రీకరించిన ఓ యువకుడిపై కేసు నమోదు చేశారు. మండలంలోని అనంతపేటలో గల 163 పోలింగ్ స్టేషన్లో ఓ యువకుడు తాను ఓటు వేసేటప్పుడు తన మొబైల్ ఫోన్లో చిత్రీకరించాడు. ఈ విషయాన్ని వెబ్ కాస్టింగ్‌లో అధికారులు గమనించి యువకుడి ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఆర్డీవో ఆదేశాల మేరకు అతనిపై కేసు నమోదు చేసినట్లు రూట్ ఆఫీసర్ అజయ్ కుమార్ తెలిపారు.

దురుసుగా ప్రవర్తించిన ఇద్దరిపై కేసు

సారంగాపూర్: మండలంలోని వంజర్‌లో ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న శిక్షణ పోలీసు కానిస్టేబుళ్లతో దురుసుగా ప్రవర్తించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. పోలింగ్ కేంద్రం వద్ద విధులు నిర్వర్తిస్తున్న ట్రెయినీ కానిస్టేబుల్ సమీపంలో నినాదాలు వినిపించడంతో అక్కడికి వెళ్లి అలా చేయొద్దని సూచించారు. అందుకు ఆగ్రహించిన గ్రామానికి చెందిన రుక్మారెడ్డి, లక్ష్మారెడ్డి అతన్ని బూతులు తిడుతూ విధులకు ఆటంకం కలిగించారు. బాధితుని ఫిర్యాదు మేరకు నిందితులపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అదుపుతప్పి ఆటో బోల్తా..

నార్నూర్: గాదిగూడ మండలంలోని మారేగావ్ వద్ద సోమవారం అదుపుతప్పి ఆటో బోల్తా పడిన ఘటనలో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మారేగావ్ గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఆటోలో గాదిగూడ మండల కేంద్రానికి వెళ్లారు. తిరుగుప్రయాణంలో మార్గమధ్యలో అదుపుతప్పి ఆటో బోల్తాపడడంతో ఆత్రం విఠల్ దంపతులతో పాటు కొడప జంగు, ఆత్రం శేరావు, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. అటు వైపుగా వెళ్తున్న ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూర్ సంతోష్ క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గాదిగూడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఇళ్లలోకి దూసుకొచ్చిన అడవిపంది

తాంసి: మండలంలోని కప్పర్లలో సోమవారం పంటచేల నుంచి దారితప్పి వచ్చిన అడవిపంది గ్రామంలోని పలు ఇళ్లలోకి దూసుకురావడంతో గ్రామస్తులు భయాందోళన చెందారు. గ్రామానికి చెందిన కూకటి దత్తు, గంగయ్య ఇళ్లలోకి దూసుకెళ్లిన అడవిపందిని గ్రామస్తులు కర్రలతో తరమడంతో మళ్లీ పంటచేల వైపు పరిగెత్తింది.

ఓటేసిన శతాధిక వృద్ధులు



నిర్మల్‌చైన్‌గేట్: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సోమవారం కుంటాల మండలం పెంచికలపాడు గ్రామానికి చెందిన దొంతుల శంకర్ నాయనమ్మ దొంతుల శివక్క(103)ను ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి తీసుకువచ్చారు. వృద్ధురాలు ఉత్సాహంగా తన ఓటు హక్కు వినియోగించుకుంది.

నిర్మల్‌లో.. 102 ఏళ్ల బామ్మ



నిర్మల్: జిల్లాకేంద్రంలోని ప్రియదర్శినినగర్‌కు చెందిన 102 ఏళ్ల గంప భాగీర్తమ్మ ఎన్నికల్లో ఆసక్తిగా ఓటేసింది. ఇప్పటికీ ఆరోగ్యంగా తనపని తాను చేసుకుంటున్న ఈ సీనియర్ ఓటర్ సోమవారం తన కొడుకు గంప శ్రీనివాస్, కోడలు తార, మనుమడు అనిల్‌కుమార్, మునిమనుమడు కృష్ణచైతన్యలతో కలిసి వెళ్లి ఓటువేసింది.

ఓటింగ్‌లో పాల్గొన్న గొల్లఘాట్ వాసులు



తాంసి: భీంపూర్ మండలంలోని గొల్లఘాట్ గ్రామస్తులు సోమవారం పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకున్నారు. తమ గ్రామానికి రోడ్డు సౌకర్యంలేదని గత అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించారు. ఎన్నికల అనంతరం అప్పటి కలెక్టర్ రాహుల్‌రాజ్ గ్రామాన్ని సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తప్పనిసరిగా ఓటుహక్కు వినియోగించుకుని గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని అవగాహన కల్పించారు. గ్రామంలో 262 మంది ఓటర్లు ఉండగా 207 మంది పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకున్నారు.

ఓటేసిన థర్డ్ జెండర్లు



పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆదిలాబాద్ పట్టణంలోని పిట్టల్‌వాడ, రాంనగర్, వడ్డెర కాలనీల్లోని పోలింగ్ కేంద్రాల్లో సోమవారం థర్డ్ జెండర్లు ఓటుహక్కు వినియోగించుకున్నారు. వరుస క్రమంలో నిలబడి తమవంతు వచ్చిన తర్వాత ఓటు వేశారు. సిరా గుర్తు చూపిస్తూ సెల్ఫీలు దిగారు. – ఆదిలాబాద్‌టౌన్

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 9502615217. [M-1185076]

■మా కంపెనీలో పనిచేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. వయసు 18 నుండి 26 సంవత్సరాలు లోపు వారు చదువు అవసరం లేదు. వసతి ఫ్రీ. జీతం: 10000-15000. సంప్ర:: 9849316058 [W-1242458]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462